క్లుప్తంగా

ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తుందని, వీటిని సక్రమంగా వినియోగించుకోవాలని వీఎస్‌పురం, యారబాడు సర్పంచ్‌లు పుట్టా ఆదిలక్ష్మి, యాబాజి రమేష్ కోరారు. మండలంలోని వీఎస్‌పురం యూపీ స్కూల్లో 25 మంది విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ట్యాబ్‌లతో విద్యాప్రమాణాలను పెంచుకోవాలని సూచించారు. స్కూల్ కమిటీ చైర్మన్ ముద్దాడ సింహాచలం, హెచ్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణాలు



మాట్లాడుతున్న జేడీ జయరాజ్

సారవకోట: కిసాన్ క్రెడిట్ కార్డులున్న పాడి రైతులకు రూ.2 లక్షల వరకు రుణాలు అందించనున్నట్లు పశు సంవర్ధకశాఖ టెక్కలి జేడీ వి.జయరాజ్ తెలిపారు. మండల కేంద్రంలోని పశు సంవర్థక శాఖ ఏడీ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రుణాలున్న రైతులకు రూ.50 వేలు నుంచి రూ.2 లక్షల వరకు ఏడాదికి 7 శాతం వడ్డీపై రుణాలు అందించనున్నట్లు తెలిపారు. దీనిపై సచివాలయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి



స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని అవలింగి మల్లేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో బుధవారం తిరువీధి నిర్వహించారు. మార్గశిర మాసం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో ఊరేగించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నరసన్నపేట: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ప్రభుత్వాన్ని కోరారు. నరసన్నపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలుసార్లు చర్చలు జరిపిందన్నారు. వీలున్నంత తొందరగా సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సీఐటీయూ ప్రతినిధులు ఆర్.సురేష్ బాబు, ఐసీడీఎస్ కార్యకర్తలు, ఆయాల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్‌ఎం గోవిందరావు

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న కొత్తూరుకు చెందిన చోడవరపు పోలినాయుడుకి రూ.7 వేలు, పండ్లను హెచ్‌ఎం ఎం.గోవిందరావు, ఉపాధ్యాయులు బుధవారం అందజేశారు. పోలినాయుడు ఇటీవల పాఠశాల మైదానంలో కబడ్డీ ఆడుతుండగా ప్రమాదవశాత్తు పడిపోవడంతో చేయికి బలమైన గాయం తగిలింది. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విరాళాలు సేకరించి ఆ మొత్తం విద్యార్థికి ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు.

నేడు బూర్జలో స్పీకర్ పర్యటన

సరుబుజ్జిలి: బూర్జ మండలంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలసలో స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7.30 లకు ఉప్పినివలసలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఆడుదాం ఆంధ్రా



కొత్తూరు: ఓండ్రుజోలలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం–ఆంధ్రా' క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం నిర్వహించిన పోటీల్లో యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పోటీలతో గ్రామాల్లో సందడి నెలకొంది. క్రీడా పోటీలను ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాలీబాల్ పోటీలు ఆడుతున్న క్రీడాకారులు



సారవకోట: మండల కేంద్రంలో షటిల్ ఆడుతున్న ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు



జలుమూరు: పాగోడు ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు దామ మన్మథరావు



మెళియాపుట్టి: పుస్తిలవార గ్రామంలో క్రీడాకారులతో జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, సర్పంచ్ వసంతకుమారి



సరుబుజ్జిలి: మండల కేంద్రంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధానకార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



పాతపట్నం: కొరసవాడ జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: యువతకు అంతర్జాతీయ ఖ్యాతి లభించేలా క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలోనే ఎక్కడాలేని విధంగా క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. యువత అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సచివాలయాల ద్వారా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 47 రోజులపాటు క్రీడా ఉత్సవాలను నిర్వహించి బహుమతులతో సత్కరించనుందన్నారు. నియోజకవర్గంలోని 91 గ్రామ సచివాలయ పరిధిలోని 700 గ్రామాల్లో క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో ఇసుక దోపిడీ..

తెలుగుదేశం ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి ఇసుక దోపిడీ, అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. కలమట వెంకటరమణమూర్తి కేవలం ఇసుక దోపిడీ కోసమే పార్టీ ఫిరాయించారన్నారు. జగనన్న భిక్ష వల్ల ఎమ్మెల్యే గెలిసిన కలమట, ముడుపుల కోసం తల్లిలాంటి పార్టీని విడిచిపెట్టారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్లు సాధించి తీరుతుందని, టీడీపీని ప్రజలే భూస్థాపితం చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ ఎనుతల సూర్యం, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ వెంకటరమణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, యువజన విభాగం మండల అధ్యక్షుడు జి.రాము, నాయకులు పనుకు మోహన్, ప్రవీణ్, శ్రీధర్, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించాలి



అధికారికి సూచనలిస్తున్న ఎంపీపీ కూర్మినాయుడు

సారవకోట: ప్రతీ మూడు నెలలకొకసారి నిర్వహించే ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు సారవకోట, బొంతు పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించాలని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమావేశాలు నిర్వహించి రెండు పీహెచ్‌సీల వైద్యులను సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం కోసం ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేస్తుందని, దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళిక తయారు చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్‌ను సూచించారు. ఉపాధి పథకం ద్వారా 17 నుంచి 18 రకాల పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారని, దానిని గ్రామస్థాయికి తీసుకెళ్లేలా చూడాలన్నారు. రెండు నెలల క్రితం వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు ఇప్పటివరకు తన దృష్టికి తీసుకురాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 2024 – 25కు అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. ప్రారంభ నిల్వ రూ 1,13,700, రాబడులు రూ 61,77,51,200, వ్యయం రూ.61,77,35,200, ముగింపు నిల్వ రూ.1,29,700లను సభ్యులు ఆమోదం తెలిపారు. ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ హనుమంతరావు, వైస్ ఎంపీపీ ఎడ్ల అసిరయ్య, మండల పరిషత్ ఏఓ చిన్నమ్ముడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. మండలంలోని కట్యాచార్యులపేట గ్రామంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లల జీవితం నాశనం అవుతుందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశ యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతీ ఇంటిలోనూ ఆడ, మగ పిల్లలను సమానంగా పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఇంటిలో క్రమశిక్షణ నేర్పితే పాఠశాలల్లో సత్‌ప్రవర్తనతో ఉంటారని సూచించారు. ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ ర్యాలీలో మండల మహిళా సమాఖ్య వీఓఏ రాజు, మహిళలు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 15 మంది తరలింపు



బస్సులో తరలిస్తున్న దృశ్యం

కొత్తూరు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 15 మందిని కంటి ఆపరేషన్లకు తరలించారు. వీరిని విశాఖపట్నంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బుధవారం ప్రత్యేక వాహనం ద్వారా తీసుకువెళ్లినట్లు స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పలి జానకిరామయ్య తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వీరిని గుర్తించామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మెళియాపుట్టి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 29వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని చెట్లు తొలగింపు, విద్యుత్ వైర్లు మరమ్మతులు చేయనున్నామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతపట్నం, కొరసవాడ, కాగువాడ, తిడ్డిమి, చంగుడి, సరాలి, రంకిణి, బగడల, గురండి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

స్వామిబాబుకు ఘనంగా నివాళులు



స్వామిబాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

నరసన్నపేట: ప్రముఖ దాత, స్వాతంత్ర్య సమర యోధుడు పొట్నూరు స్వామిబాబు జయంతిని నరసన్నపేటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, పంచాయతీ ఈఓ చిన్నారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్వామిబాబు మహాదాత అని అన్నారు. ఆయనను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నరసన్నపేటలో ప్రస్తుతం ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలకు అప్పట్లో ఆయన దానం చేసిన స్థలాలేనని గుర్తుచేశారు. కులాంతర వివాహాలను బాగా ప్రోత్సహించారన్నారు. శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు, వార్డు సభ్యులు బీఎల్ శర్మ, స్థానిక నాయకులు ధర్మాన జగన్, ఇట్రాజు సూరిబాబు, నేతింటి సింహాచలం, ఎస్‌పీసీటీ ప్రతినిధులు రమేష్, కాంతారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

దోమ తెరలు, దుప్పట్లు పంపిణీ



కొత్తగూడలో గిరిజలకు దుప్పట్లు, దోమ తెరులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని ఉల్లిమానుగూడ, కొత్తగూడ, చీపురుపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులకు రెడ్ క్రాస్ ఆఫ్ సింగపూర్ సౌజన్యంతో రెడ్ క్రాస్ ఆఫ్ ఇండియా రాష్ట్ర, జిల్లా శాఖల ఆధ్వర్యంలో బుధవారం దోమ తెరలు, దుప్పట్లు, హైజిన్ కిట్లును జిల్లా శాఖ సభ్యుడు చిన్మయరావు పంపిణీ చేశారు. కరోనాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. జిల్లా శాఖ చైర్మన్ జగన్మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు చిన్మయరావు తెలిపారు. మండల శాఖ సభ్యులు పొగిరి రవిసుజాత, సత్యనారాయణ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మూగుపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

సారవకోట: మండలంలోని పెద్దలంబ పంచాయతీ మూగుపురం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంబాబు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరుకావాలన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ఆర్థికసాయం

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేసే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు మండల మహిళా సమాఖ్య నుంచి ఆర్థికసాయం అందిస్తామని ఏపీఎం జనార్దనరావు తెలిపారు. మండలంలోని మహసింగూడ గిరిజన గ్రామంలో నిర్వహిస్తున్న శాశ్వత ద్రవజీవామృతం తయారుచేస్తున్న కుండీలను, ఏటీఎం పద్ధతిలో సాగు చేసే పంటలను బుధవారం పరిశీలించారు. ఏటీఎం విధానం ద్వారా లభించే ఆదాయాన్ని రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఏటీఎం పద్ధతిలో సాగు చేస్తామన్న ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూమిలేని వారికి ఎంఎంఎల్ ద్వారా రుణాలు అందజేస్తామని ఏపీఎం తెలిపారు. మాస్టర్ ట్రైనీ సవర సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసు శాంతి స్వరూపుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నిస్సాహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి ఏసు క్రీస్తు అందించిన సందేశాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ఉర్లాం గ్లోరీ టీ జీసస్ మినిస్ట్రీ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా చర్చి ఫౌండర్, డైరెక్టర్ ఎ.సుందర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతిని అలవర్చుకోవాలన్నారు. సేవా మార్గాన్ని అనుసరించాలన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, సతివాడ రామినాయుడు, తోట భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

నాగమణిని ఆదర్శంగా తీసుకోవాలి



నాగమణిని అభినందిస్తున్న శ్రీశైన సంఘం నాయకులు

ఎల్.ఎన్.పేట: ప్రతీ విద్యార్థి బమ్మిడి నాగమణిని ఆదర్శవంతంగా తీసుకోవాలని శ్రీశైన రాష్ట్ర కన్వీనర్ పట్నాల వెంకటేష్ బాబు (ఏలూరు) అన్నారు. మండలంలోని పెద్దకోట గ్రామానికి చెందిన నాగమణి ఎస్సై ఉద్యోగం సంపాదించిన సందర్భంగా ఆమెను బుధవారం అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదువుకుంటూ ఉద్యోగం సాధించటం ఆదర్శనీయమన్నారు. తండ్రి సింహాచలం ఊరూరా తిరిగి కూరగాయలు విక్రయిస్తారన్నారు. పేదరికం చదువుకు అడ్డు కాదని నిరూపించిన ఆమెను అభినందించారు. కార్యక్రమంలో శ్రీశైన రాష్ట్ర మాజీ డైరెక్టర్ పూతి రమణ, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోగాది అప్పలనాయుడు, శ్రీశైన మండల నాయకులు కాగాన మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.